ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
గురువారం 6 జూన్ 2024



తండ్రి అసెంబ్లీకి.. కొడుకు పార్లమెంట్‌కు

● తొలిసారి చట్టసభల్లో పుట్టా కుటుంబం





పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్, సుధాకర్ యాదవ్

మైదుకూరు, జూన్ 5: తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొంది తండ్రీ కొడుకులు చట్ట సభల్లో మొట్ట మొదటి సారి అడుగు పెట్ట నున్నారు. తండ్రి పుట్టా సుధాకర్ యాదవ్ మైదు కూరు ఎమ్మెల్యేగా, తనయుడు పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ ఏలూరు పార్లమెంట్ సభ్యుడిగా గెలుపొందిన సంగతి తెలిసిందే.

బి.మఠం మండలవాసి అయిన పుట్టా సుధాకర్‌యాదవ్ వ్యాపార రంగంలో ఉండేవారు. అప్పట్లో మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న శెట్టిపల్లె రఘు రామిరెడ్డి వైసీపీకి వెళ్లడంతో.. ఇక్కడ అసెంబ్లీ టికెట్‌ను 2014లో పుట్టా సుధాకర్ యాదవ్‌కు ఇచ్చారు. 2014తో పాటు 2019లోనూ టీడీపీ నుంచి పోటీచేసిన ఆయన ఓటమిపాలయ్యారు. అయితే 2014లో టీడీపీ ప్రభుత్వం రావడంతో అధినేత చంద్రబాబు నాయుడు పుట్టా సుధాకర్ యాదవ్‌కు తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్‌గా సముచిత స్థానం కల్పించారు. ఈ 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన.. వైసీపీ అభ్యర్థి శెట్టిపల్లె రఘురామిరెడ్డిపై 20,950 ఓట్ల ఆధిక్యతతో గెలిపొంది తొలి సారిగా శాసనసభలో అడుగు పెట్టనున్నారు.

అలాగే ఆయన పెద్ద కుమారుడు, మాజీ మంత్రి యనమల రామక్రిష్ణ అల్లుడు అయిన పుట్టా మహేశ్‌కుమార్‌యాదవ్‌కు కూడా ఈ ఎన్నికలు కలిసొచ్చాయి. ఏలూరులో యాదవ సామాజిక వర్గానికి చెందిన కారుమూరి సునీల్‌కుమార్‌కు వైసీపీ ఎంపీ టికెట్ ఇవ్వడంతో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కూడా అదే సామాజిక వర్గానికి చెందిన మహేశ్‌కుమార్ కుమార్ యాదవ్‌ను అక్కడ బరిలో దింపారు. ఆ ప్రాంతానికి కొత్త అయినా అతి కొద్ది సమయంలోనే ఆయన పార్టీ శ్రేణులకు దగ్గరయ్యారు. ప్రచారంలోనూ అందరిని ఆకట్టు కొంటూ సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. అంతేగాక ఆ ప్రాంతంలో పోలవరం పునరావాస సమస్యతో బాధపడుతున్న ప్రజలను ఆదుకోవడం కోసం జనసేనాని పవన్ కళ్యాణ్ తన ప్రచారంలో ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తామంటూ కోటి రూపాయలను తాను ఇస్తానని ప్రకటించారు. దీంతో ఆదే సమావేశంలో పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ కూడా తన వంతుగా ఆ నిధికి ఒక కోటి రూపాయలు విరాళం ప్రకటించారు. అలాగే కొల్లేరు ప్రాంతంలో ఆక్వా రంగానికి చేయూత అందిస్తానని, ఉద్యాన పంట సాగును ప్రోత్సహించేలా ఫుడ్ పార్కు వంటి చిన్న తరహా పరిశ్రమలకు తోడ్పాటు అందిస్తానంటూ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ వైసీపీ అభ్యర్థిపై 1,78,326 ఓట్ల ఆధిక్యంతో గెలిపొంది విజయదుందుభి మోగించారు. దీంతో ఒకేసారి.. మొట్టమొదటిసారి చట్టసభల్లో తండ్రీకొడుకులు అడుగు పెట్టనుండటంతో మైదుకూరులో టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

కడప పార్లమెంటుకు క్రాస్ ఓటింగ్



వేశారని

● టీడీపీకి గండికొట్టిన బీజేపీ పొత్తు.. షర్మిల పోటీ
● ఎమ్మెల్యే ఓటు టీడీపీకి.. ఎంపీ ఓటు వైసీపీకి డైవర్ట్
● ఐదు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీదే ఆధిపత్యం
● పులివెందుల, బద్వేలులోనే వైసీపీ ఎఫెక్ట్
● అయినా వైసీపీ అభ్యర్థే గెలుపు
● నోటాకు 16,846 ఓట్లు

(కడప-ఆంధ్రజ్యోతి): కడప పార్లమెంటు ఎన్నికల ఫలితాలకోసం యావత్ దేశం ఆసక్తిగా ఎదురు చూసింది. స్టేట్‌లో ఎక్కడా లేని విధంగా అంతా కడప పార్లమెంటు వైపే చూశారు. టీడీపీ నుంచి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి, వైసీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ అవినాశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి జగన్ సోదరి వైఎస్ షర్మిల పోటీ చేయడమే ఇంత హైప్‌కు కారణం. అందరూ ఊహించినట్లుగానే ఈ ఎన్నిక అంతా ఉత్కంఠ భరితంగా సాగింది. అయితే కడప పార్లమెంటు పరిధిలోని ఐదు అసెంబ్లీ స్థానాలను టీడీపీ గెలుపొందగా.. కేవలం రెండు చోట్లనే వైసీపీ సత్తా చాటింది. వాస్తవంగా టీడీపీ ఎమ్మెల్యేలకు పోల్ అయిన ఓట్లన్నీ ఎంపీ భూపేశ్‌కు పడి ఉంటే 25వేల పైబడి మెజార్టీతో గెలిచి ఉండేవాడు. అయితే ఆ ఓట్లు బాగా డైవర్ట్ అయిపోయాయి. దీంతో పులివెందుల, బద్వేలులో వచ్చిన మెజార్టీతోనే ఎంపీ అవినాశ్‌రెడ్డి బయటపడ్డారు. క్రాస్ ఓటింగే టీడీపీ కొంప ముంచిందని అర్థమవుతోంది. ఓ పక్క షర్మిలకు ఓట్లు చీలగా, మరో వైపు బీజేపీ పొత్తు కారణంగా కొందరు ముస్లిం మైనార్టీలు, క్రిస్టియన్లు అటు వైపు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు ఫలితాల సరళిని చూస్తే అర్థమవుతోంది. ప్రతి రౌండ్ పార్లమెంటు ఫలితాలు రౌండ్ రౌండ్‌కు ఉత్కంఠ రేపాయి. పులివెందుల మినహాయిస్తే మెజార్టీ అటు ఇటు మారుతూ వచ్చింది. ఏ రౌండ్‌లో ఎవరి జాతకం మారుతుందోనంటూ ఆసక్తిగా చూశారు. కడప పార్లమెంటుకు 1,32,3510 ఓట్లు పోల్ కాగా, ఇందులో 1,335 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. 16,846 నోటాకు పడ్డాయి. వైసీపీ అభ్యర్థి అవినాశ్‌కు 6,05,143 ఓట్లు, కూటమి అభ్యర్థి భూపేశ్‌కు 5,42,448 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి షర్మిలకు 1,41,039 ఓట్లు వచ్చాయి.

ఏ రౌండ్ ఎటో..

పార్లమెంటు ఎన్నికల్లో ఏ రౌండ్ ఎవరికి ఆధిక్యం వస్తుందో అనే తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అసెంబ్లీ ఫలితాల్లో టీడీపీ కూటమి అభ్యర్థులు దూసుకెళ్లారు. కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరులో కూటమి అభ్యర్థులు గెలుపొందారు. భారీ మెజార్టీతోనే విజయం సాధించారు. కడప అసెంబ్లీ అభ్యర్థి మాధవీరెడ్డి 18,860, కమలాపురం క్రిష్ణచైతన్యరెడ్డి 25,357, జమ్మలమడుగు ఆదినారాయణరెడ్డి 17,191, ప్రొద్దుటూరు నుంచి వరదరాజులరెడ్డి 22,744, మైదుకూరు నుంచి పుట్టా సుధాకర్‌యాదవ్ 20,950 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. కూటమి అభ్యర్థులకు ఐదు చోట్లా కలిపి 1,05,102 ఓట్లు మెజార్టీ వచ్చాయి. ఇక పులివెందుల నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 61,687, బద్వేలు నుంచి దాసరి సుధ 18,567 ఓట్లతో గెలుపొందారు. వీరిద్దరికీ కలిపి 80,254 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థులకు పడిన ఓట్లన్నీ టీడీపీ ఎంపీకి పడి ఉంటే 25,848 ఓట్లతో కడప ఎంపీగా భూపేశ్‌రెడ్డి గెలవాల్సి ఉంది. అయితే క్రాస్ ఓటింగ్ పడడంతో ఆ ఓట్లు అటు కాంగ్రెస్ అభ్యర్థి షర్మిలా, మరికొన్ని ఓట్లు వైసీపీకి బదిలీ అయినట్లు అర్థమవుతోంది. దాదాపు 90 వేల ఓట్లు క్రాస్ ఓటింగ్ జరిగినట్లు స్పష్టమవుతోంది. జిల్లాలో ముస్లిం మైనార్టీలు, క్రిస్టియన్లు పెద్దసంఖ్యలో ఉన్నారు. ఈ వర్గాల్లో కొందరు బీజేపీని వ్యతిరేకిస్తారు. వీరిలో కొంత మంది ఎమ్మెల్యేకు టీడీపీకి ఓట్లు వేసి ఎంపీకి మాత్రం అటు షర్మిల లేదా అవినాశ్‌కు ఓట్లు వేశారని స్పష్టంగా తెలిసిపోతోంది. దివంగత వైఎస్ కూతురుపై అభిమానంతో కొందరు షర్మిలా వైపు మొగ్గుచూపడం టీడీపీకి మైనస్ అయిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

నియోజకవర్గాల వారీగా ఓట్లు ..

నియోజకవర్గం	వైసీపీ	టీడీపీ	కాంగ్రెస్
కడప	62,015	66,090	52,132
పులివెందుల	1,08,134	47757	25,956
బద్వేలు	91,211	62,342	10,552
ప్రొద్దుటూరు	83,233	90,964	19,964
కమలాపురం	75,232	79,750	12,080
జమ్మలమడుగు	96,996	1,02,318	6,079
మైదుకూరు	81,585	83,137	9,632
పోస్టల్ బ్యాలెట్	6737	10,090	4644
మొత్తం	6,05,143	5,42,448	1.41.039

టీడీపీ సమన్వయం ఏదీ

రాష్ట్రంలో మిగతా జిల్లాల్లో టీడీపీ శ్రేణులు వైసీపీని వీరోచితంగా ఎదుర్కొన్నాయి. వైసీపీ దౌర్జన్యాలను అడుగడుగునా ప్రశ్నించాయి. పొరుగు జిల్లాలతో పోలిస్తే కడప జిల్లాలో టీడీపీ ఆ పోరాటం చూపించలేదు. పైకి అందరితో కలిసి ఉన్నట్లు నటించినా లోపల ఒకరంటే ఒకరికి పడదు. జిల్లాను ఏకతాటిపై నడిపే నాయకుడే లేరు. కేవలం జగన్ అరాచకాలను భరించలేక, వైసీపీ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ చంద్రబాబును సీఎం చేయాలన్న ఉద్దేశ్యంతో జనం ఓట్లు వేశారే తప్ప నేతల పోరాటం కొన్ని నియోజకవర్గాల్లో నామమాత్రమే అని చెప్పాలి. కలిసికట్టుగా ప్రచారం చేయడం లేదు. టీడీపీ నేతల్లో సమన్వయం లేదనేది స్పష్టంగా తెలుస్తోంది. అయితే ఓటర్లు మాత్రం సొంత జిల్లా వాసి సీఎం అయినా కూడా ఆయనను కాదని టీడీపీకే పట్టం కట్టారు. అంతా కలిసికట్టుగా పనిచేసుంటే ఎంపీ స్థానంతో పాటు బద్వేలును కూడా టీడీపీనే గెలుచుకుని ఉండేదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

రవిరెడ్డీ.. చిల్లర చేష్టలు మానుకో

● కమలాపురం ప్రజల పురోగతికి మాతో కలిసి రా..
● ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి, పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి

కడప(మారుతీనగర్), జూన్ 5: ఇటీవల వెలువడిన రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల ఫలితాలలో వైసీపీ అడ్రస్ లేకుండా చతికిలపడిందని.. అయితే రవిరెడ్డి ఓటమిని అంగీకరించకుండా చిల్లర ఆరోపణలు చేయడం తగదని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహా రెడ్డి పేర్కొన్నారు. ఐదు సంవత్సరాలుగా సాగిన జగన్‌రెడ్డి దుర్మార్గ పాలనకు అంతం పలికేలా ప్రజలు సునామీ రూపంలో ఓట్లు వేసి టీడీపీ కూటమి అభ్యర్థులకు పట్టం కట్టారన్నారు. అది జీర్ణించుకోలేక కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి తమ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సింగపూర్‌లో నుంచే ఈవీఎంలను ట్యాంపరింగ్ చేశారంటూ చిన్నపిల్లోడి తరహాలో ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక బిల్టప్ సమీపంలోని పుత్తా ఎస్టేట్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పార్టీకి 151 అసెంబ్లీ స్థానాలను ప్రజలు కట్టబెట్టారనే సంగతి గుర్తెరగాలన్నారు. అప్పట్లో కమలాపురం నుంచి ఆయన గెలుపొందినపుడు తాము ఇలాంటి చిల్లర ఆరోపణలు చేయలేదన్నారు. వైసీపీ అవినీతి పాలనకు ప్రజలు విసిగిపోయి శంకరగిరి మాణ్యాలకు పంపించారనే సంగతి మరువరాదన్నారు. ఇప్పటికైనా చౌకబారు చిల్లర చేష్టలు మానుకొని కమలాపురం ప్రజల పురోగతికి తమతో కలిసి వస్తే స్వాగతిస్తామన్నారు. కాదు కూడదని నిరాధార ఆరోపణలు చేస్తే పదేళ్లుగా నీవు చేసిన భూ దందాల తాలూకు అవినీతి చిట్టా గుట్టును బహిర్గతం చేస్తామని స్పష్టం చేశారు.

డబ్బుల పందేరంతో ఓట్లు రాలవు

● వైసీపీ అవినీతి.. అరాచకపాలన అంతానికి చాలా కసిగా ఓటేశారు
● ప్రజలపై నిందలు అటుంచి ఆత్మావలోకనం చేసుకో
● టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య



కడప(మారుతీనగర్), జూన్ 5: సంక్షేమం మాటున ప్రజలకు విచ్చలవిడిగా డబ్బులు పందేరం చేసినంత మాత్రాన ఓట్లు రాలవనే సంగతి ఈ ఫలితాలు రుజువు చేశాయని టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య పేర్కొన్నారు. ఐదు సంవత్సరాలుగా అవినీతి, అరాచక పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రజలంతా ఒకే మాట ఒకే బాటగా చాలా కసితో గంటల తరబడి నిలిచి మరీ తెలుగుదేశం పార్టీ కూటమికి ఓట్లేశారన్నారు. దేశ చరిత్రలో కనీ వినీ ఎరుగని రీతిలో జగన్‌రెడ్డి పార్టీని మట్టికరిపించిన తీరు ఆశ్చర్యకరమన్నారు. బుధవారం కడపలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాపితంగా వైసీపీ మంత్రులు, నాయకులతో పాటుగా కింది స్థాయి చోటామోటా నాయకులు సైతం అందిన కాడికి ప్రభుత్వ స్థలాల మొదలు ఇసుక, మట్టి, కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, హస్తగతం చేసుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారు. వీటికి తోడు పేదల భూములు, స్థలాలను సైతం లాక్కోవడం, బెదిరించడం, పరిపాటిగా మారిందన్నారు. పన్నుల రూపంలో ప్రజలను ఏడిపించి వారి రక్తం తాగేలా పాలన సాగించిన జగన్‌రెడ్డికి ఆ దేవుడు సరైన శిక్ష విధించారన్నారు. అయినప్పటికీ ఓటమి పట్ల ప్రజలనే నిందించేలా జగన్‌రెడ్డి చేసిన వాఖ్యలు సరైందికాదన్నారు. ఇప్పటికైనా ప్రజలను బాధ్యులను చేయడం అటుంచి ఆత్మావలోకనం చేసుకోవాలని సూచించారు. కడప ఎమ్మెల్యే స్థానానికి మొట్టమొదటగా ఎన్నికై చరిత్ర సృష్టించిన ఆర్.మాధవిరెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఈవీఎంలను ట్యాంపరింగ్ చేశారు: రవిరెడ్డి

కడప(ఎర్రముక్కపల్లె), జూన్ 5: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవీయంలను టీడీపీ ట్యాంపరింగ్ చేసిందని కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాధరెడ్డి ఆరోపించారు. దీనిపై కోర్టును ఆశ్రయి స్తామని అన్నారు. బుధవారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాల యంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు వ్యవస్థలను మేనేజ్ చేయగల శక్తివంతుడన్నారు. ఈవీయంలను ట్యాంపరింగ్ చేశారనేది అనుమానంగా ఉందన్నారు. ఈ విషయంపై తప్పకుండా కోర్టును ఆశ్రయిస్తామన్నారు. సింగపూర్‌లో కూర్చుని చంద్రబాబు ట్యాంపరింగ్ చేశారా అన్నది తేలాల్సి ఉందన్నారు. బార్ కోడ్ తెలిస్తే చాలు ట్యాంపరింగ్ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం నియోజకవర్గం వైసీపీ నేతలు పాల్గొన్నారు.

అసెంబ్లీలో జగన్‌రెడ్డిని నిలదీస్తాం

● ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది, చిత్రంలో ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, జూన్ 5: అసెంబ్లీలో వైసీపీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని నిలదీసి అడుగుతామని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి హెచ్చరించారు. బుధవారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అయిదు సంవత్సరాలు దరిద్రపు పాలన జరిగిందని, ప్రజలు ఓటు ద్వారా తరిమారన్నారు. రాష్ట్రంలో భారతిరెడ్డి రాజ్యాంగం అమలు జరిగిందన్నారు. జగన్‌రెడ్డి రాష్ట్రానికి చేసింది ఏమీలేదన్నారు. చేనేతలను, నిరుద్యోగులను తదితర వారందరిని సర్వనాశనం చేశారన్నారు. ఇసుక దోపిడీ చేశారన్నారు. ప్రతిపక్ష పార్టీలకు చేయని తప్పులకు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టారన్నారు. జమ్మలమడుగు అభివృద్ధికోసం కృషి చేస్తానన్నారు. అవినాశ్‌రెడ్డికి చెక్‌పెట్టి భూపేశ్‌రెడ్డిని ఎంపీ సీటులో కూర్చోబెట్టేందుకు అందరు కృషి చేయాలన్నారు. భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ తనకు జిల్లాలో అయిదు నియోజకవర్గాల్లో మెజార్టీ వచ్చిందని, కేవలం పులివెందుల, బద్వేలు ప్రాంతాల్లో మెజార్టీ ఓట్లు రాలేదన్నారు. తమ నేత చంద్రబాబు ఆశీర్వాదంతో జమ్మలమడుగుతోపాటు జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, బీజేపీ నాయకులు శశిభూషణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి మూడు కొత్త ముఖాలు

● కడపలో 20 ఏళ్ల తరువాత టీడీపీ విజయం

(కడప-ఆంధ్రజ్యోతి): కడప అంటే రాజకీయంగా జగన్ కుటుంబం అడ్డా అనుకుంటారు. అయితే ఒకప్పుడు కడప జిల్లా టీడీపీకి కంచుకోట. రాజశేఖర్‌రెడ్డి సీఎం కాక ముందు ఉమ్మడి కడప జిల్లాలో 1994, 99 ఎన్నికల్లో ఏడెనిమిది సీట్లు గెలుచుకుంది. వైఎస్ హవాలో 2004లో కూడా రెండు స్థానాలు గెలుచుకుంది. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఒక్క సీటుకు పరిమితమైతే 2019లో ఒక్క సీటూ గెలుచుకోలేదు. అయితే ఈ సారి ఎన్నికల్లో టీడీపీ పూర్వ వైభవం సాధించేందుకు చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారు. అందుకు తగ్గట్లుగానే జిల్లాలో నారా లోకేశ్ యువగళం పాదయాత్ర పులివెందుల మినహా ఆరు నియోజకవర్గాల్లో సాగింది. బంపర్ హిట్ అయింది. తరువాత చంద్రబాబు పర్యటనలు, సభలకు జనం పోటెత్తారు. ఇవన్నీ జిల్లాలో టీడీపీకి పాజిటివ్‌గా మారాయి. దీంతో పాటు అభ్యర్థులను ఆచి తూచి ఎంపిక చేయడం కూడా బాగా కలిసి వచ్చింది. అదే ఇప్పుడు సత్ఫలితాలు ఇచ్చింది..



కడప రెడ్డెమ్మ

కూటమి నుంచి ఐదుగురు అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిస్తే ముగ్గురు తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెడుతుండడం గమనార్హం. కడప అసెంబ్లీ నుంచి ఆర్.మాధవీరెడ్డి గెలుపొందారు. తొలిసారిగా కడప అసెంబ్లీ స్థానానికి ఎమ్మెల్యేగా గెలిచిన మహిళగా చరిత్ర సృష్టించారు. ఇంతవరకు కడపలో ఏ ప్రధాన పార్టీ నుంచి మహిళలు పోటీ చేయలేదు. అయితే తొమ్మిది నెలల క్రితం ఆర్.మాధవిని చంద్రబాబు ఇన్‌చార్జిగా ప్రకటించారు. చంద్రబాబు అంచనాలు ఏ మాత్రం మిస్ కాకుండా ఆమె జనాల్లోకి రాకెట్‌లా దూసుకెళ్లారు. సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. వైసీపీ బ్యాచ్ చేసే కవ్వింపు చర్యలకు ఎదురొడ్డి నిల బడ్డారు. ఓ విధంగా చెప్పాలంటే మాధవి మగరాయు డులా కడప గల్లీలో తిరుగుతూ ఫైట్ చేశారు. జనంతో మమేకం కావడం, ప్రత్యర్థులపై నేరుగా విమర్శలు చేయడంతో తక్కువ సమయంలోనే రాష్ట్రంలోనే గుర్తింపు పొందారు. ఆమె ప్రచారం చేసిన చోట జనం సమస్యలను సాదరంగా విని పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చారు. కడప జనం ఈసారి మార్పు కోరుకున్నారు. అంజద్‌బాషా డిప్యూటీ సీఎంగా ఉన్నప్పటికీ సొంత సామాజిక వర్గానికే మేలు చేయలేదనే విమర్శ ఉంది. ఈ ఐదేళ్ల రౌడీయిజం, మర్డర్లు, గంజాయికి కేరాఫ్‌గా మారడంతో జనం బిక్కుబిక్కుమని గడిపారు. ఆ టైంలో మాధవి జనంలో తిరుగుతూ నేనున్నానంటూ భరోసా ఇవ్వడంతో జనం ఆమెకు జై కొట్టారు.

కమలాపురం కింగ్



కమలాపురం నుంచి పుత్తా క్రిష్ణ చైతన్య రెడ్డి తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు. చైతన్యరెడ్డి తండ్రి పుత్తా నరసింహారెడ్డి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు. 2009, 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. అయితే ఈ పర్యాయం టీడీపీ ఆయన కొడుకుకు టికెట్ ఇచ్చింది. పుత్తా నరసింహారెడ్డి నమ్ముకున్న కేడరుకు న్యాయం చేస్తారని అంటారు. ఎవరైనా ఆయన వద్దకు వస్తే తప్పకుండా న్యాయం చేస్తారని చెబుతారు. వరుసగా పుత్తా నరసింహారెడ్డి ఓడిపోవడంతో ఆ కుటుంబంపై నియోజకవర్గ ప్రజల్లో సానుభూతి పెరిగింది. ఇక ఎమ్మెల్యే రవిరెడ్డి అనుచరుల కబ్జాలు, ఆగడాలు మైనింగ్ దందా, సొంతపార్టీకి చెందిన నాయకుల భూములే కబ్జా చేయడం ఇవన్నీ టీడీపీకి ప్లస్‌గా మారాయి. రవిరెడ్డి సొంతపార్టీ కార్యకర్తలనే పట్టించుకోలేదు. చైతన్యరెడ్డి తొలిసారిగా పోటీచేయడం, ఆయన తండ్రిపై ఉన్న సానుభూతి కలిసి వచ్చింది. ఉన్నత విద్యావంతుడు కావడం, ఎలాంటి ఆరోపణలు లేకుండా వైట్ పేపరుగా ఉండడం చైతన్యకు కలిసి వచ్చింది. దీంతో ఆయన భారీ మెజార్టీతో గెలిచి తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు.

ఎట్టకేలకు పుట్టా

మైదుకూరు నుంచి తొలిసారిగా పుట్టా సుధాకర్‌యాదవ్ ఎమ్మెల్యేగా గెలిచారు. రెండు పర్యాయాలుగా పుట్టా సుధాకర్‌యాదవ్ టీడీపీ నుంచి పోటీ చేస్తున్నారు. అయితే ప్రతిసారి పుట్టాది గెలుపు అంటూ ప్రచారం సాగుతుంది. చివరికి వచ్చేప్పటికి ఓటమితోనే మిగులుతున్నారు. 2014-2019 టీడీపీ హయాంలో టీటీడీ బోర్డు ఛైర్మన్‌గా పనిచేశారు. అయితే ఎలాగైనా మైదుకూరు నుంచి గెలవాలన్న కసితో పట్టు వదలని విక్రమార్కుడిలా పనిచేస్తూ వచ్చారు. అసెంబ్లీలోనే అడుగు పెట్టాలనేది ఆయన చిరకాల కోరిక. ఈసారి పుట్టా సుధాకర్‌యాదవ్ మాత్రమే కాదు.. ఆయన కొడుకు ఎంపీగా ఎన్నిక కావడం గమనార్హం.



మైదుకూరు ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం బి.మఠం వెళ్లిన పుట్టా సుధాకర్‌యాదవ్‌కు స్వాగతం పలుకుతున్న జనం

‘ఎవరు గెలిచినా మీదే గెలుపు’ విజేత బి.కోడూరు వాసి!

● ఆంధ్రజ్యోతి కార్యాలయంలో లక్కీడ్రా
● నలుగురు విజేతల ఎంపిక

చెన్నూరు, జూన్ 5: ‘శాసనసభ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు?’ అనే అంశంపై ఆంధ్రజ్యోతి- నిర్వహించిన లక్కీడ్రాకు పాఠకుల నుంచి విశేష స్పందన లభించింది. ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో ఏ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొందుతుందో పాఠకుల నుంచే అంచనాలు వేస్తూ కూపన్లు స్వీకరించింది. ఈ మేరకు వేలాది కూపన్లు వచ్చాయి. కాగా.. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. ఉమ్మడి కడప జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాల్లో కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, రైల్వేకోడూరు, రాయచోటిలో కూటమి అభ్యర్థులు గెలుపొందారు. పులివెందుల, బద్వేలు, రాజంపేటలో వైసీపీ గెలిచింది. ఈ మేరకు అంచనా వేస్తూ పంపించిన కూపన్ల నుంచి బుధవారం సాయంత్రం చెన్నూరు రోడ్డులోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. మొదటి విజేతగా బి.కోడూరు మండలం ఐత్రంపేటకు చెందిన చాటకొండు పుల్లయ్య అనే చందాదారుడు ప్రథమ బహుమతి కింద రూ.10వేలు గెలుచుకున్నారు. అలాగే రూ.5వేల చొప్పున మూడు ద్వితీయ బహుమతులను దువ్వూరు టీచర్స్ కాలనీకి చెందిన బండి మహేశ్వరి, రాజంపేట గుత్తా నగర్‌కు చెందిన శ్రీకాంత్‌బాబు తలిపిరెడ్డి, కడపకు చెందిన కొల్లి కృష్ణమూర్తి గెలుచుకున్నారు. విజేతలకు బహుమతిని త్వరలో అందజేస్తారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజరు అబ్బిగారి నరసయ్య, ఎడిషన్ ఇన్‌చార్జి సుంకోజి దేవేంద్రాచారి, సెకండ్ ఇన్‌చార్జి కె.కృష్ణమరాజు, ఏసీఎం కె.రామమోహన్‌రెడ్డి, టెక్నికల్ ఇన్‌చార్జి చంద్ర శేఖర్, ఆంధ్రజ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

విజేతల వివరాలు

● రూ.10వేలు గెలుపొందిన మొదటి విజేత..

- చాటకొండు పుల్లయ్య, 3/81 శివాలయం వీధి, ఐత్రంపేట, బీకోడూరు.

● రూ.5వేల చొప్పున గెలుపొందిన ద్వితీయ విజేతలు

1. బండి మహేశ్వరి, 1/68, టీచర్స్ కాలనీ, దువ్వూరు.
2. శ్రీకాంత్‌బాబు తలిపిరెడ్డి, 5/98-4, గుత్తానగర్, రాజంపేట.
3. కొల్లి కృష్ణమూర్తి, 79/51-12, నారపరెడ్డి విల్లాస్, కడప.



విజేతలను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తున్న దృశ్యం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● కలెక్టరు విజయరామరాజు




మొక్కలు నాటుతున్న కలెక్టర్, విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఈవో

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 5: పర్యావరణ పరిరక్షణకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టరు విజయరామరాజు పిలుపునిచ్చారు. బుధవారం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా కలెక్టరు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరిస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు ప్రవీణ్‌చంద్, ఆర్డీవో, ప్రిన్సిపాల్ సలీంబాషా, ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్ విజయలక్ష్మీదేవి, డాక్టర్ శచీదేవి, డాక్టర్ సుబ్రమణ్యంలు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు : కడప నగరం రాయచోటి రోడ్డు మున్సిపల్ పార్కులో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగర పాలక సంస్థ సహకారంతో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనురాధ, సమగ్ర శిక్ష సీఎంవో కేశవరెడ్డి, కార్పొరేషన్ అసిస్టెంటు డైరెక్టరు అనిల్‌కుమార్, రిటైర్డ్ హెచ్ఎం బాలయల్లారెడ్డి, వైవీయూ అసిస్టెంటు ప్రొఫెసరు మృత్యుంజయరావు పాల్గొన్నారు.

10,116 టెంకాయలు కొట్టిన తెలుగు తమ్ముళ్లు

● గండి అంజన్నకు ప్రత్యేక పూజలు



గండిలో టెంకాయలు కొడుతున్న టీడీపీ శ్రేణులు

చక్రాయపేట, జూన్ 5: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించడంతో గండి వీరాంజనేయస్వామి ఆలయంలో వేంపల్లెకు చెందిన తెలుగు తమ్ముళ్లు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఆలయం సమీపంలోని పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం ఎదుట టీడీపీ నేతలు సింగారెడ్డి రజనీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 10,116 టెంకాయలను కొట్టారు. మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, యువ నేతలు భరత్‌రెడ్డి, రవితేజరెడ్డి, టీడీపీ సీనియర్ నేతలు బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, షబ్బీర్, కన్వీనర్ మునిరెడ్డి తదితరులు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజలందరికీ సంక్షేమం జరగాలన్నా టీడీపీ అధికారంలోకి రావాలని ప్రజలు ఎన్డీయేకి పట్టం కట్టబెట్టారని తెలిపారు. అక్కడకు వచ్చిన కార్యకర్తలంతా టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వల్లి, మడక శ్రీనివాసులు, డక్కా రమేష్, మండల ఉపాధ్యక్షులు భద్ర, పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేష్, నామా వేమకుమార్, మహమ్మద్, జిల్లా ఉపాధ్యక్షులు రామగంగిరెడ్డి, మాజీ సర్పంచు వీరలింగేశ్వరరెడ్డి, నల్లగారి రామకృష్ణారెడ్డి, గండి మాజీ చైర్మన్ రమణ, రెడ్డి కిషోర్, పోతిరెడ్డి శివ, మాజీ దేవస్థాన చైర్మన్ ఎద్దల కొండ్రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎం వేధింపులు భరించలేక

ఆశా కార్యకర్త ఆత్మహత్యాయత్నం



ఆశావర్కర్‌ను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో

రాయచోటిటౌన్, జూన్ 5: ఏఎన్ఎం వేధింపులు భరించలేక పాత రాయచోటికి చెందిన ఆశావర్కర్ వెంకటలక్ష్మి (చిట్టెమ్మ) బుధవారం తలకు పూసుకునే రంగు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి కథనం మేరకు... రాయచోటి పట్టణంలోని వాల్మీకి స్ట్రీట్‌లో గల అర్బన్ పీహెచ్‌సీలో వెంకటలక్ష్మి ఆశావర్కర్‌గా పనిచేస్తోంది. ఆమె తన విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నప్పటికీ అదే పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఏఎన్ఎం వేధింపులు ఎక్కువయ్యాయి. సమస్యను సంబంధిత డాక్టర్‌తో పాటు హెల్త్ సూపర్‌వైజర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించకపోగా ఏఎన్ఎంకే వైద్యులు కూడా వత్తాసు పలకడంతో బుధవారం ఆమె తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స కోసం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో కోలుకుంటోంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య రాయచోటి ఏరియా ఆసుపత్రికి చేరుకుని ఆశావర్కర్‌ను పరామర్శించి జరిగిన సంఘటనను విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని చెప్పారు. కాగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడటానికి కారకులైన ఏఎన్ఎంతో పాటు సూపర్‌వైజర్‌పై జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు విచారణ జరిపించి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ఇన్‌చార్జి గంగాధర్ డిమాండ్ చేశారు.

ఆశాను వేధించిన ఏఎన్ఎంను సస్పెండ్ చేయాలి



ఏరియా ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

ఆత్మహత్యాయత్నానానికి పాల్పడిన ఆశావర్కర్ చిట్టెమ్మకు న్యాయం చేయాలని ఏరియా ఆసుపత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎస్.మెహరున్నీషా, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరామాంజులు, జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షులు ఏవీ రమణ మాట్లాడుతూ ఏఎన్ఎం పార్వతీభాయ్ బహిరంగంగా తీవ్ర అసభ్య పదజాలంతో తిట్టిన కారణంగా మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఆరోపించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



మల్లయ్య (ఫైల్)

ఒంటిమిట్ట, జూన్ 5 : మండల పరిధిలోని కుడుమలూరు గ్రామంలో అప్పుల బాధతో నేతగాని మల్లయ్య (52) అనే వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యవసాయంతో పాటు కుటుంబ సమస్యలతో సతమతమవడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు ఫిర్యాదు రావడంతో పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.


వరదరాజులరెడ్డికి అభినందనల వెల్లువ



వరదరాజులరెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 5: తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎన్.వరదరాజులరెడ్డిని తెలుగుదేశం పార్టీ ఎస్సీసెల్ మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరి పి.దేవదాసు ఘనంగా సత్కరించారు. బుధవారం ఉదయం కామనూరులో వరదరాజులరెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయనకు అభినందనలు తెలిపి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మనోహర్, విజయబాబు, సంజీవకుమార్, కమలమ్మ, జ్యోత్స్న, నిర్మల, శ్రీను, వెంకటసుబ్బయ్య, ముస్కిన్, తదితరులు పాల్గొన్నారు.

ఓల్టాకు తూట్లు..




బోర్లలో నీరు రాకపోవడంతో సాగుచేయక వదిలేసిన భూములు

ధరణిపై పోట్లు

- భూగర్భజలాలు అడుగంటడంతో ఎండిపోతున్న పంటలు
- లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వేస్తున్న బోర్లు
- భారీగా నష్టపోతున్న రైతులు

రాజంపేట, జూన్ 5: వరుణుడి కరుణ లేకపోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయి పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఓల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ విచ్చలవిడిగా బోర్లు వేస్తూ లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. వెయ్యి నుంచి 2 వేల అడుగులు బోర్లు వేసినా నీటి జాడ కనిపించడం లేదని వాపోతున్నారు. రెండున్నర సంవత్సరాలుగా వర్షం కురవకపోవడంతో రాజంపేట ప్రాంతంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. 2 వేల అడుగులు బోర్లు వేసినా చుక్క నీరు పడటం లేదు. రెండున్నర సంవత్సరాలుగా వర్షాలు లేకపోవడం, అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి చుక్కనీరు లేకపోవడం వల్ల భూగర్భజలం లేకుండాపోయింది. ఈ సమయంలో సాగు చేసిన పంటలను కాపాడుకోవడానికి రైతులు లక్షలు ఖర్చు చేసి కొత్తగా బోర్లు వేస్తున్నారు. ఒక్కో బోరుకు లక్ష రూపాయలు పైబడి ఖర్చు చేస్తున్నా భూగర్భజలం రావడం లేదు. ఒక్కో రైతు నాలుగు ఎకరాల పొలంలోనే నాలుగు బోర్లు వేసి నాలుగు లక్షలు ఖర్చు పెట్టుకుంటున్నా ఉపయోగం లేకుండాపోతోంది. ప్రస్తుతం బోరుబావుల్లో భూగర్భజలాలు తగ్గడంతో రైతులు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి కొత్త బోర్లు వేయడం ప్రారంభించారు. ఎక్కడచూసినా బోర్లు వేయడమే కనిపిస్తోంది. దీనివల్ల ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో భూగర్భ జలాలు అడుగంటకుండా అందరికీ తాగునీరు, సాగునీరు అందించే ఉద్దేశ్యంతో ఓల్టా చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ చట్టం ఉద్దేశ్యం ఏంటంటే ఒక బోరు ఉన్న ప్రాంతం నుంచి 250 మీటర్ల వరకు పరిసర ప్రాంతాలలో ఎవరూ బోర్లు వేయకూడదు. ఒకవేళ ఎవరైనా వేస్తే వారిపై కేసులు నమోదు చేస్తారు. నిబంధనలకు విరుద్ధంగా వేసిన బోరును సీజ్ చేస్తారు, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యుఎస్, ఎంపీడీవో అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఓల్టా చట్టాన్ని అమలు చేయాలి. ఈ చట్టాన్ని అమలు చేసే అధికారే లేకుండాపోయారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే నామమాత్రపు చర్యలు తీసుకుంటూ తిరిగి వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రస్తుత కరువు పరిస్థితిలో ఆశకు పోయిన రైతులు తమ పాత బోర్లు ఎండి పోవడంతో కొత్త బోర్లు అధికంగా వేస్తున్నారు. దీనివల్ల ఇప్పటికే వందల కోట్లు నష్టపోతున్నారు. రాష్ట్రమంతా కరువుతో అల్లాడుతున్న ఈ స్థితిలో కనీస జ్ఞానాన్ని పాటించకుండా నీరు రావని తెలిసి కూడా బోర్లను ఇష్టమొచ్చినట్లు వేసి కోట్లు ఖర్చు చేస్తున్నారు. దీనిద్వారా భూగర్భజలం పూర్తిగా ఇంకిపోయింది. రైతులకు చుక్కనీరు రాదు కదా కోట్లు ఖర్చు చేశారు. ఈ విధంగా ఓల్టా చట్టాన్ని తుంగలో తొక్కారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో ఎక్కడ చూసినా బోర్ల శబ్దమే వినవస్తోంది. ఇప్పటికే ఈ రెండు నియోజక వర్గాలలో వందలాది బోర్లు వేశారు. గత ఏడాది వర్షమే లేకపోవడంతో భూగర్భజలాలు 1000 అడుగుల లోతుకు ఇంకిపోవడం, పంటలన్నీ పూర్తిగా ఎండిపోయాయి. దీనివల్ల వందలాది బోర్లు ఎండిపోతున్నాయి. ఒక్కో బోరుకు 1000 అడుగుల నుంచి 1500 అడుగుల వరకు వేస్తున్నారు. ఒక్కో బోరు వేయడానికి లక్ష ఖర్చవుతోంది. ఇలా అనేక మంది రైతులు లక్ష నుంచి 5 లక్షలు పైబడి కేవలం బోర్లు వేసుకోవడానికే ఖర్చు చేస్తున్నారు. అయినా చుక్కనీరు పడటం లేదు. ఈ కొత్త బోర్లు వేయడం వల్ల వాటిలో నీరు రాకపోవడం వల్ల పాత బోర్లు ఎండిపోవడం, వదిలేయడం ఇలా చేయడం వల్ల కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. దానికి తోడు చుక్క నీరు రాకపోవడంతో రైతులు వడ్డీలకు అప్పులు చేసి బోర్ల కోసం పెట్టిన ఖర్చులు బూడిదలో పోసిన పన్నీరుగా మారి పంటలన్నీ ఎండిపోతున్నాయి.

భూగర్భజలాలు అడుగంటి ఎండిపోతున్న పంటలు, (ఇన్‌సెట్లో) కొత్త బోర్లు వేస్తున్న రైతులు

కడపలో టీడీపీ జెండా ఎగురవేశాం

● కడపను అన్నివిధాలా అబివృద్ధి చేస్తాం ● ఎమ్మెల్యే మాధవీరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు .శ్రీనివాసరెడ్డి



ఆర్ఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మాధవీరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కుటుంబ సభ్యులు

లక్కిరెడ్డిపల్లె, జూన్ 5 : కడప నియోజకవర్గంలో 20 సంవత్సరాల తరువాత టీడీపీ జెండాను ఎగురవేశామని, కడప నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం లక్కిరెడ్డిపల్లెలోని మాజీ మంత్రి ఆర్.రాజగోపాల్‌రెడ్డి ఘాట్ వద్ద శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కడియాల క్రిష్ణమూర్తి కుమారుడు వెంకటప్రసాదు పేదల కోసం నిర్మిస్తున్న కల్యాణ మండపానికి విరాళం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కడప కోటలు బద్దలు కొట్టామని, గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ ఎంత వేగంగా ఎగిరిపడ్డారో అంతకు మించిన వేగంతో కిందికి దించామన్నారు. రాష్ట్రంలో వైసీపీ అరాచకపాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. మాజీ మంత్రి రాజగోపాల్‌రెడ్డి 1960 నుంచి లక్కిరెడ్డిపల్లె నుంచి పోటీ చేసి ఎన్నోసార్లు ఘన విజయాలు సాధించి రాష్ట్రంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి అని కొనియాడారు. ఉమ్మడి కడప జిల్లాలో 7 అసెంబ్లీ స్థానాలు గెలవడం ఒక ఎత్తు అయితే.. తెలుగుదేశం పార్టీ జెండాను కడప నగరంలో ఎగురవేసి చంద్రబాబునాయుడుకు బహుమతిగా ఇచ్చామన్నారు. గతంలో కడప ఎమ్మెల్యేను గుర్తించడం చాలా తక్కువ. కడప ఎమ్మెల్యే అంటే జగనా అనే వారు, అలాంటి ఎమ్మెల్యేకి ప్రజలు బుద్ధి చెప్పారు. కడప నియోజకవర్గంలో గెలిచింది జగన్ మీద అన్నారు. రాజగోపాల్‌రెడ్డి వారసులుగా ప్రజాసేవ మళ్లీ కొనసాగిస్తామని, ఈ విజయం ఆయనకు అంకితం చేస్తున్నామని తెలిపారు. కడప ప్రజలకు అందుబాటులో ఉండి కడప నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి, ఆర్.నాగేంద్రారెడ్డి, ఆర్.విశ్వనాధరెడ్డి, మాజీ ఎంపీపీ అనుంపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటు యూత్ ప్రెసిడెంట్ తోపిరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, గాలివీడు వెంకటశివారెడ్డి, టీడీపీ కార్యకర్తలు ఆర్ఆర్ అభిమానులు పాల్గొన్నారు.

సచివాలయంపై జగన్ లోగో తొలగింపు



సచివాలయంపై జగన్ లోగోపై పసుపురంగు వేసిన దృశ్యం

పెనగలూరు, జూన్ 5: మండలంలోని ముద్రపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయంపైన ముద్రించిన ముఖ్యమంత్రి జగన్ లోగోను గ్రామ ప్రజలు తుడిచి వేశారు. ముద్రపల్లె యువకులు పసుపుపచ్చ రంగు డబ్బా తీసుకువచ్చి గ్రామ సచివాలయంపై ముద్రించిన జగన్ లోగోను పసుపు రంగుతో తుడిచివేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత ప్రభుత్వ కార్యాలయాలలో రాజకీయ నాయకుల చిత్రపటాలు, దానికి సంబంధించిన బొమ్మలు, ఇతరత్రా ఏవైనా ఉంటే తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినప్పటికీ ముఖ్యమంత్రి జగన్ దెబ్బకు భయపడిన అధికారులు, ఉన్నతాధికారులు సైతం వాటి జోలికి వెళ్లలేదని తెలిపారు. ప్రభుత్వం మారడం వల్ల అయిదేళ్ల ప్రజలకు నరకం చూపించిన జగన్ బొమ్మను చూడటం కూడా పాపమని భావించి ఇలా చేయాల్సి వచ్చిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో జగన్ లోగోలు, చిత్రపటాలను వెంటనే తొలగించాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు.

రాజోలి నిర్మించి తీరుతాం

● రూ.90 కోట్ల తాగునీటి పథకంపై కలెక్టర్‌తో మాట్లాడా : మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు, జూన్ 5 : రాజోలి జలాశయం నిర్మించి తీరుతామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన మొదట సారిగా బుధవారం రాత్రి పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమై విలేకరులతో మాట్లాడారు. అవినీతి, కమీషన్ల పర్వం అనేదే లేకుండా అభివృద్ధే ధ్యేయంగా పాలన చేస్తానని, తొలిరోజే బృహత్తర ఇంటింటికి తాగునీరు అందించేందుకు దాదాపు 90 కోట్ల నిధులపై కలెక్టర్‌తో మాట్లాడానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేస్తూ అవినీతికి తావులేకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని, సీఎం చంద్రబాబుతో మాట్లాడి రాజోలి జలాశయం, స్టేడియం నిర్మిస్తానన్నారు. అధికారులతో కలసి ప్రతి గ్రామంలో తిరిగి ప్రజా సమస్యలపై బాధ్యత వహిస్తానని తెలిపారు. బృహత్తర తాగునీటి పథకంపైకలెక్టర్ విజయరామరాజుతో మాట్లాడానన్నారు. కాగా కేంద్రంలోనూ ఎన్డీయే కూటమి ఉంది కాబట్టి ప్రత్యేక నిధులు తీసుకవస్తానని, ఎల్లప్పుడూ ప్రజల అభివృద్ధి కోసమే పాటు పడతానన్నారు. కక్ష పూరిత రాజకీయాలు చేయనని పేర్కొన్నారు. కాగా తొలిసారిగా మైదుకూరుకు రావడంతో నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో అభినందించారు. పట్టణంలోని పాతూరులో వెలసిన పెద్దమ్మతల్లిని పుట్టా సుధాకర్ యాదవ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

నాదెండ్ల మనోహర్‌ను కలిసిన తుంగా రమణయ్య



నాదెండ్ల మనోహర్‌ను సన్మానిస్తున్న తుంగా రమణయ్య

కడప (ఎడ్యుకేషన్), జూన్ 5: కడప జనసేన నేత తుంగా రమణయ్య బుధవారం సాయంత్రం తెనాలి ఎమ్మెల్యే ఆఫీసులో జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ నాయుడును కలిశారు. దుశ్శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా జనసేన, టీడీపీ, బీజేపీ ఎమ్మెల్యేల గురించి జిల్లా రాజకీయాల గురించి నాదెండ్ల మనోహర్‌కు వివరించారు. కార్యక్రమంలో తుంగా కిరణ్, గజ్జల సాయి, చార్లెస్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుద్రహోమం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 5: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా రుద్రహోమం నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం ఆలయ కాలక్షేప మండపంలో గంగ, రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఆశీనులను చేసి కన్నుల పండువగా కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చక్రాయపేట, జూన్ 5: మహదేవపల్లె, చక్రాయపేట, కె.రాజుపల్లె, కె.ఎర్రగుడి సబ్‌స్టేషన్ల పరిధి గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈఈ ప్రవీణ్ కుమార్ యాదవ్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. చక్రాయపేట ఫీడర్‌లో నూతన టవర్ల నిర్మాణం కారణంగా ఎల్‌సీ తీసుకోవాలని నిర్ణయించామని, వినియోగదారులు సహకరించాలని ఒక ప్రకటనలో కోరారు.

ఆడపిల్లలను రక్షిద్దాం

వీరపునాయునిపల్లె, జూన్ 5: ఆడబిడ్డను రక్షించి ఆడపిల్లలను చదివించాలని వైద్యాధికారి మహమ్మద్ తాహా, ఐసీడీఎస్ సూపర్ వైజర్ జయలక్ష్మి అన్నారు. వీరపునాయునిపల్లె ప్రాథమిక కేంద్రం నుంచి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని ఆడ,మగ సమానమే అన్నారు. లింగ వివక్షపై ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చైతన్యకు అభిమానుల తాకిడి




పుత్తా నరసింహారెడ్డి, పుత్తా చైతన్యను సన్మానిస్తున్న కార్యకర్తలు, అభిమానులు - వల్లూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు, అభిమానులు

● జనసంద్రమైన టీడీపీ కార్యాలయం

కమలాపురం రూరల్, జూన్ 5: ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో ఎన్నికైన పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డిని అభినందించేందుకు ఆయన స్వగృహం, కమలాపురం టీడీపీ కార్యాలయంలో భారీ స్థాయిలో అభిమానుల తాకిడి మొదలైంది. ప్రతి మండలం నుంచి పూలమాలలతో కేక్ కట్ చేస్తూ స్వీట్లు పంపిణీ చేస్తూ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ కోలాహలంగా మారింది. నియోజకవర్గ స్థాయి నుంచి అన్నిమండలాల గ్రామాల నుంచి టీడీపీ అభిమానులు తరలివచ్చారు. 20 ఏళ్లగా రాని విజయం ఈ సారి రావడంతో అభిమానుల్లో ఉత్సాహం పెరిగిపోయింది. ఉదయం నుంచి చాలా ఓపికతో ఆయన అభిమానులను పలకరిస్తూ వచ్చారు.

సి.కొత్తపల్లెలో సంబరాలు

వల్లూరు, జూన్ 5: టీడీపీ అభ్యర్థి క్రిష్ణచైతన్యరెడ్డి అఖండ మెజార్టీతో విజయం సాధించడంతో సి.కొత్తపల్లెలో బుధవారం సాయంత్రం సంబరాలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి స్థానిక నేతలు రమణారెడ్డి, ఓబులేసు యాదవ్, మాధవరెడ్డి భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. అందరికీ సంక్షేమ పథకాలు అందించే బాధ్యత టీడీపీకి ఉందన్నారు. బీసీలకు పథకాలను అందించే బాధ్యతను ఇప్పటికే తమ నేతలు తీసుకున్నారన్నారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చండి

కడప (మారుతీనగర్) జూన్ 5: ఎంతో కాలంగా నెరవేరని కమలాపురం ప్రజల ఆకాంక్షలు ఎంఎల్‌ఏ పుత్తా కృష్ణచైతన్య హయాంలో నెరవేరాలని కాపు, బలిజ సంక్షేమ సేన ఉమ్మడి జిల్లాల కో ఆర్డినేటర్ జి.వి. రమణ కోరారు. ఎన్నికల ఫలితాల్లో కమలాపురం ఎంఎల్ఏగా విజయం సాధించిన పుత్తా చైతన్యను పుత్తా ఎస్టేట్‌లో కలిసి ఎంఎల్‌ఏ, ఆయన తండ్రి పుత్తా నరసింహారెడ్డిని అభినందించారు. సేన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కమలాపురం నేతలు వెంకటసుబ్బయ్య, బలిజ సంఘం నేతలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం : మాజీ డిప్యూటీ సీఎం

కడప (ఎడ్యుకేషన్), జూన్ 5: పోరాటాల నుంచి పుట్టిన పార్టీ వైసీపీ అని, ప్రజా సమస్యల పరిష్కారానికి మళ్లీ పోరాటా లకు సిద్ధమవుతామని మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్ బాషా తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపోటములు సహజమేనన్నారు. మా నాయకుడు జగన్ కడప నగరాభివృద్ధి కోసం నిధులు కేటాయించారని, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన నేతలు ఆ అభివృద్ధిని కొనసాగించాలన్నారు. 2019లో ఏ పార్టీకి ఇవ్వనంత ఆదరణ తమ పార్టీకి కలిగిందని, మళ్లీ ప్రజల్లోకి వెళతాం, ప్రజా సమస్యలపై ప్రజల పక్షాన పోరాడతామన్నారు. వైసీపీ కోసం అహర్నిశలు కృషి చేసిన వైసీపీ నేతలు, కార్యకర్తలకు నగర ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటామన్నారు.

20 ఏళ్ల కల నేటితో ఫలించింది

కమలాపురం రూరల్, జూన్ 5: 20 ఏళ్లగా నెరవేరని కల నేటితో తీరిందని టీడీపీ ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాష అన్నారు. మంగళవారం కమలాపురం టీడీపీ కార్యాలయంలో జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ 20ఏళ్ల తరువాత కమలాపురం నియోజకవర్గంలో టీడీపీ అఖండ మెజార్టీతో టీడీపీ అభ్యర్థిగా పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డికి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ గెలుపు కోసం కృషి చేసిన నేతలు, కార్యకర్తలు, ఓటర్లకు ముస్లింలకు అభినందనలు తెలిపారు.,

ఇది ప్రజావిజయం : టీడీపీ



విలేకరులతో మాట్లాడుతున్న అమీర్‌బాబు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టారని ఇది ప్రజా విజయమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అవలంభించిన ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలు విసిగి పోయారన్నారు. ఈ రాష్ట్రానికి రాజధాని రావాలని, పోలవరం నిర్మించాలని, నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచినందుకు ప్రతి విషయంలోనూ జగన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు జలతోటి జయకుమార్, రహ్మతుల్లా, మేకల వెంకటేశ్‌యాదవ్, కొమ్మలపాటి సుబ్బరాయుడు, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో టీడీపీ జెండా ఎగురవేస్తా

ధన్యవాదాలు తెలిపిన బీటెక్ రవి

పులివెందుల టౌన్, మే 5: పులివెందులలో టీడీపీ జెండా ఎగురవేస్తానని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్ర నాథరెడ్డి (బీటెక్ రవి) అన్నారు. నియోజకవర్గం టీడీపీ నేతలు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలిపిన ఆయన మట్లాడుతూ ఈ ఎన్నికల్లో శక్తికి మించి కృషిచేసినా రాష్ట్రంలో ఇతర నియోజకవర్గాల్లో వచ్చిన ఫలితాలు మన పులివెందులలో రాలేదన్నారు. ఇందుకు బాధగా ఉందన్నారు. జగన్‌రెడ్డి పాలన పట్ల రాష్ట్రమంతటా వ్యతిరేక పవనాలు వీసినా ఇక్కడ జగన్‌రెడ్డినే ఎన్నుకున్నా రన్నారు. రాష్ట్రమంతటా టీడీపీ విజయదుందుభి మోగించినందుకు ఆనందంగా ఉన్నా పులివెందులలో మంచి ఫలితాలు సాధించలేక పోయామే అనే ఆవేదన ఉందన్నారు. ఏనాడైతే పులివెందులలో టీడీపీ జెండా ఎగురుతుందో ఆనాడే నాకు తృప్తి అన్నారు. రాబోయే రోజుల్లో మీ అందరి సహకారంతో పులివెందుల ప్రజల్లో సైతం మార్పు తెస్తా, పులివెందులలో కూడా టీడీపీ జెండా ఎగురవేస్తాం అనే నమ్మకం మాకుందన్నారు. జగన్‌రెడ్డి మెజారిటీని 30వేలు తగ్గించిన మీ అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీ విజయోత్సవ ర్యాలీ



పులివెందులలో ర్యాలీ నిర్వహిస్తున్న తెలుగు తమ్ముళ్లు

పులివెందుల టౌన్, జూన్ 5: రోటరీపురం నుంచి టీడీపీ కార్యాలయం వరకు తెలుగు తమ్ముళ్లు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. పులివెందుల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఏపీలో టీడీపీ అఖండ మెజారిటీ సాధించడం, పులివెందులలో వైసీపీకి మెజార్టీ తగ్గించడంతో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తోందన్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అణచివేత, భూఆక్రమణతోనే వైసీపీ ఓటమి

సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న గాలిచంద్ర

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 5: జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ల్యాండ్, శాండ్, మైన్, వైన్ మాఫియాను పెంచి పోషించడంతోనే వైసీపీ ఓటమికి కారణమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర తెలిపారు. సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదాయాన్ని కొల్ల గొట్టి వ్యక్తిగత ఆస్తులు పెంచుకుంటూ, ప్రజలు ప్రజా సమస్య లను పూర్తిగా పక్కకు నెట్టి ప్రశ్నించే అన్నివర్గాలను అణచి వేయడం తగదన్నారు. అహంకారపూరితంగా పెత్తందారి మనస్తత్వంతో విర్రవీగిన జగన్ సర్కారుకు ప్రజలు రాజకీయ సమాధి కట్టారన్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రజల సమస్యలు పరిష్కరించి, సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తారని అనుకుంటే ప్రజలపై పన్నులు వేసి ఇబ్బంది పెట్టడమే అభివృద్ధి అని అనుకున్నారన్నారు. భూములు ఆక్రమించి అడ్డు వచ్చిన వారిని అడ్డు తొలగించుకుని వారిపై కేసులు బనాయించి పైశాచిక ఆనందం పొందేవారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, వేణుగోపాల్, కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడ్డ వారికి అండగా నిలుస్తాం

టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి



వేంపల్లెలో విలేకరులతో మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

వేంపల్లె, జూన్ 5: పులివెందుల నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామని టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి తెలిపారు. వేంపల్లె టీడీపీ కార్యాలయంలో స్థానిక నేతలతో సమావేశమైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసినందున బీటెక్ రవికి మంచి ఓటింగ్ శాతం వచ్చిందని తెలిపారు. సైకో పాలనను ప్రజ లు తరిమిగొట్టారని ఇక రాష్ట్రం టీడీపీ ద్వారా సమగ్రాభివృద్ధి చెందుతుందన్నారు. నిజాయితీగా పనిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు భరత్‌రెడ్డి, తేజరెడ్డి, మునిరెడ్డి, షబ్బీర్, నిమ్మకాయల దర్బార్, రజనీకాంత్‌రెడ్డి, మల్లంగి పాపిరెడ్డి, పూల అల్లాబక్షు, కరిముల్లా, జబీఉల్లా, నామా వేమకుమార్, మైనార్టీ కన్వీనర్ వలి, డాక్టర్ సుబ్బారెడ్డి, మాబుషరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వాసును కలిసిన వేంపల్లె తమ్ముళ్లు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డిని వేంపల్లె టీడీపీ నేతలు కలిసి మాధవి విజయంపై శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. మండల కన్వీనర్ మునిరెడ్డి, బీసీ నేతలు మడక శ్రీనివాసులు, దక్కా రమేష్, వేమకుమార్, జబీవుల్లా, మహమ్మద్ పాల్గొన్నారు. కుమ్మరాంపల్లె మాజీ సర్పంచు భర్త కొండ్రెడ్డి భాస్కర్‌రెడ్డి శ్రీనివాసరెడ్డిని కలిసి సత్కరించారు.

అంబరాన్ని అంటిన సంబరాలు



కేక్ కట్ చేస్తున్న గంగిరెడ్డి

పెండ్లిమర్రి, జూన్ 5: మండలంలో టీడీపీకి అన్ని పోలింగ్ బూత్‌లలో మెజార్టీ రావడంతో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు కేకులు కట్ చేసి టపాసులు పేల్చి పండుగ చేసుకున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి, తర్వాత వైసీపీకి కంచుకోటగా ఉండేది. 2019 ఎన్నికల్లో వైసీపీకి 7900 ఓట్లు మెజార్టీ లభించింది. ఈ ఎన్నికల్లో టీడీపీకి 2900 ఓట్లు ఆధిక్యాన్ని తెచ్చిపెట్టారు. దానికి తోడు పుత్తా చైతన్య రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవడంతో సంబరాలకు హద్దే లేకుండా పోయిం ది. ప్రతి గ్రామంలో పార్టీ కార్యకర్తలు మిఠాయిలు పంపిణీ చేశారు. వెల్లటూరులో మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

‘ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి’



సురేంద్రారెడ్డి నుంచి వివరాలు నమోదు చేస్తున్న కానిస్టేబుల్

పులివెందుల టౌన్, మే 5: అసభ్యంగా ప్రవర్తించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని పులివెందుల టీడీపీ కార్యకర్త నర్రెడ్డి సురేంద్రారెడ్డి కోరారు. సురేంద్రారెడ్డి కడప రిమ్స్ పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈనెల 3వ తేదీన పులివెందుల పోలీసులు బైండోవర్ కావాలని నోటీసు ఇవ్వగా మరుసటి రోజు రామ్మోహన్ అనే పోలీసు హోమ్‌గార్డు కాల్ చేసి స్టేషన్‌కు రమ్మనగా పులివెందుల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లానన్నారు. సార్ సమయం కావస్తాఉంది ఇంటి వద్ద ఎద్దులకు గడ్డి, నీళ్లు వేయాలి నాతో సంతకం తీసుకుని పంపిస్తే వాటికి మేపు వేసి తిరిగి 4గంటలకు వస్తానని ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డిని అడిగానన్నారు. అందుకు ఎస్ఐ నువ్వు పోవాలనుకున్నప్పుడు కాదు నేను పంపిస్తేనే వెళ్లాలన్నారు. వైసీపీ వారిని పిలవకుండా మమ్మల్ని మాత్రమే పిలవడం ఏమిటని అడగ్గా పిడిగుద్దులు గుద్ది నేనువేసుకున్న బట్టలు విప్పి కూర్చోబెట్టాడన్నారు. బూటు కాలితో ముఖంపై కొట్టాడన్నారు. చాలా అసభ్యంగా ప్రవర్తిస్తూ గట్టిగా అరుస్తూ వెళ్లాడన్నారు. తీవ్ర తలనొప్పి, కళ్లు కనిపించకుండా స్పృహ తప్పి పడిపోవడంతో రిమ్స్‌కు తరలించారన్నారు. రిమ్స్‌లో పోలీసులకు తెలిపి న్యాయం జరిగేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు.

ఎమ్మెల్యే మాధవీరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ





మాధవి దంపతులకు బొకే ఇస్తున్న తుంగా రమణయ్య - గజమాలతో సత్కరిస్తున్న పవన్‌కుమార్ - సన్మానిస్తున్న మన్సూర్ ఆలీఖాన్

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 5: కడప నియోజకవర్గంలో తొలి మహిళా ఎమ్మెల్యేగా విజయం సాధించిన రెడ్డప్పగారి మాధవికి ప్రజల నుంచి శుభాకాంక్షలు వెల్లువలా వచ్చాయి. బుధవారం ఆమె నివాసంలో జనసేన, టీడీపీ నేతలు కలిసి సత్కరించారు.

కడప నగరం 37, 50 డివిజన్ల టీడీపీ నేత సుగవాసి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో కడప ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి దంపతులను గజమాలతో సన్మానించారు. టీడీపీ నేతలు రాజు, వెంకట సుబ్బారెడ్డి, సుగవాసి యువ రాజ్ పాల్గొన్నారు. జనసేన నేత తుంగా రమణయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాధవికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. టీడీపీ నేత మన్సూర్ ఆలీఖాన్ కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

దుగ్గాయపల్లె సోదరుల ఫ్లెక్సీ కాల్చివేత



కాల్చేందుకు ఫ్లెక్సీని తీసుకెళుతున్న దృశ్యం

(కడప - ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి ఆయన సోదరుడు వల్లూరు మాజీ జడ్పీటీసీ వీరారెడ్డి ఫ్లెక్సీని బుధవారం కాల్చి వేశారు. వల్లూరు మండలం తప్పెట్లలో చోటు చేసుకుంది. టీడీపీ నేత గడికోట సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాక ముందు ఆర్థిక ఇబ్బందులు పడుతూ అప్పు చేసేవారని, జగన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక అనేక అక్రమాలకు పాల్పడి కోట్లకు పడగలెత్తారన్నారు. భూదందాలు నిర్వహించడం, ఎంతో మంది దగ్గర డబ్బులు దోచుకున్నారని ఆరోపించారు. వీరికి రాజకీయ సమాధి కడుతున్నామన్నారు. వీరారెడ్డి జడ్పీటీసీ ఎన్నికలకు ఓట్ల కోసం తాను 15 లక్షలు ఇచ్చానన్నారు. దుగ్గాయపల్లె రాబందులకు తాము రాజకీయంగా సమాధి చేస్తున్నామన్నారు. పార్టీ మారి న వారిపై తప్పుడు కేసులు పెట్టి వేధించారన్నారు. ఇక నుంచి వీరికి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు.

బీజేపీ విజయోత్సవ సంబరాలు



పులివెందులలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నేతలు

పులివెందుల టౌన్, జూన్ 5: కేంద్రంలో మూడోసారి ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో బీజేపీ అధికారంలోకి రావడం, మోదీ మూడో సారి ప్రధానిగా అధికారం చేపట్టడంతో విజయోత్స సంబరాలు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నేతలు భానుప్రకాష్, గాలి హరిప్రసాద్, మహేశ్వరరెడ్డి, శ్రీరాములు, నవీన్, రమణారెడ్డి, లక్షుమయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి’

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 5: విద్యారంగ సమస్యలు పరిష్కారానికి నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కాబోతోందని మధ్యలోనే నిలిచిపోయిన ప్రభుత్వ పాఠశాలల భవన నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలన్నారు. కాస్మొటిక్, మెస్‌చార్జీలు విడుదల చేయాలన్నారు.

వాటర్ ప్లాంట్ కోసం తెలుగు తమ్ముళ్ల ఘర్షణ

పులివెందుల టౌన్, జూన్ 5: స్థానిక మంగళకాలనీ సమీపంలో వాటర్‌ప్లాంట్ కోసం తెలుగు తమ్ముళ్లు ఘర్షణ పడ్డారు. నగరిగుట్ట వాటర్ ప్లాంట్ కావాలని నగరిగుట్ట టీడీపీ కార్యకర్తలు వెంకటేశ్, శ్రీను ఘర్షణపడ్డారు. ఈ ఘర్షణలో ఇరువురికీ గాయాలవడంతో చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

29 కేంద్రాల్లో టీడీపీ విజయదుందుభి

చెన్నూరు, జూన్ 5: కమలాపురం నియోజకవర్గం ఓట్ల లెక్కింపులో చెన్నూరు మండలం నుంచి టీడీపీకి 4341 ఓట్లు మెజార్టీ వచ్చింది. దీంతో పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి మొట్టమొదటిసారిగా యువ ఎమ్మెల్యేగా అదరగొట్టారు. మండలంలోని మొత్తం 36 పోలింగ్ కేంద్రాల్లో 29 చోట్ల టీడీపీ మెజార్టీ ఓట్లు రాగా కేవలం ఏడు పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే వైసీపీ మెజార్టీని సంపాదించుకుంది. ఉప్పరపల్లె 61, 62 బూత్‌లలో 64 ఓట్లు, మైనార్టీ కాలనీలోని 64, 65 బూత్‌లలో 112 ఓట్లు, కొండపేట 80 పోలింగ్ కేంద్రం, గుర్రంపాడు 87 పోలింగ్ కేంద్రం, రాచిన్నాయపల్లె 89 పోలింగ్ కేంద్రంలో మొత్తం కలిపి 180 ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మిగిలిన 29 పోలింగ్ కేంద్రాల్లో మండల టీడీపీ నేతలు చేసిన కృషితో కార్యకర్తలు పడిన కష్టంతో మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి సారధ్యంలో విజయం 4341 ఓట్ల వరకు దూసుకెళ్లింది. దీంతో మండల టీడీపీ శ్రేణుల ఆనందానికి అవధులు లేకండా పోయాయి. వైసీపీ నేతలు మండలంలో ఒక్క చెన్నూరు మినహా మిగిలిన కొండపేట, బలసింగాయపల్లె, ఉప్పరపల్లె, రాచిన్నాయపల్లె, రామనపల్లె, గుర్రంపాడు, కొక్కిరాయపల్లె, శివాలపల్లె, చిన్నమాచుపల్లెల్లో వైసీపీకి, టీడీపీకి సమానంగా ఓట్లు వస్తాయని ఒక్క చెన్నూరులో మాత్రమే కొద్దిమేర మెజార్టీ వస్తుందని చెప్పుకున్నా టీడీపీకి ఓట్లు ఉప్పెనలా వచ్చి పడ్డాయి. దీంతో చెన్నూరు మైనార్టీ కాలనీలో మైనార్టీ యువనేత సుభాని ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేయగా రామనపల్లె సీతాలమ్మ గుడిలో అటు క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, మాజీ సర్పంచ్ శ్రీలక్ష్మి, ఉపసర్పంచ్ పుత్తా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నేతలు రామనచంద్ర మోహన్‌రెడ్డి, అధికార ప్రతినిధులు వేల్పుల సుబ్రమణ్యం, మన్నూరు అక్బర్, ముండ్లనరసింహారెడ్డి, భవానీ ఆచారి పలువురు నేతల ఆధ్వర్యంలో అమ్మవారికి 108 కొబ్బరికాయలు కొట్టి స్వీట్లు పంచుకున్నారు. మొత్తమ్మీద మండలంలో 2024 ఎన్నికలు చిన్నపాటి సునామీని సృష్టించాయి. వైసీపీ అరాచకాలే ఆ పార్టీకి గట్టి దెబ్బ తగిలేలా చేశాయని ఆ పార్టీ చేసిన పనులకు ప్రజలు విసిగి చావు దెబ్బ కొట్టారని మండల శాఖ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి అన్నారు. మొత్తమ్మీద ఈ ఎన్నికలు వైసీపీకి ఒక గుణపాఠమని, ఇక ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ అని, భవిష్యత్తు చంద్రబాబు ఆధ్వర్యంలో రామనపల్లె పంచాయతీని అన్నివిధాలా అభివృద్ధి పరుస్తామన్నారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో సంబరాలు

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 5: మైదుకూరు ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్‌యాదవ్ గెలవడం హర్షణీయమని జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు ప్రతాప్‌యాదవ్ అన్నారు. కడప నగరం యాదవ సంఘం కార్యవర్గసభ్యులు కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో బీసీ నేతలు త్రివిక్రమ్ యాదవ్, మల్లికార్జున యాదవ్, విజయకుమార్ యాదవ్, ఓబులేసు యాదవ్, చిన్న వెంకటరమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

వేంపల్లె, జూన్ 5: నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని వేంపల్లె మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని విత్తన డీల్ షాప్‌లను తనిఖీ చేశారు. విత్తనాలకు సంబంధించి స్టాక్ నిల్వ రికార్డులు, ధర పట్టికలను పరిశీలించారు. రైతుకు అమ్మిన విక్రయ రసీదులను ఇవ్వాలని హెచ్చరించారు.

నాదెండ్ల మనోహర్‌ను కలిసిన తుంగా రమణయ్య



నాదెండ్ల మనోహర్‌ను సన్మానిస్తున్న తుంగా రమణయ్య

కడప (ఎడ్యుకేషన్), జూన్ 5: కడప జనసేన నేత తుంగా రమణయ్య బుధవారం సాయంత్రం తెనాలి ఎమ్మెల్యే ఆఫీసులో జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్‌నాయుడును కలిశారు. దుశ్శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా జనసేన, టీడీపీ, బీజేపీ ఎమ్మెల్యేల గురించి జిల్లా రాజకీయాల గురించి నాదెండ్ల మనోహర్‌కు వివరించారు. కార్యక్రమంలో తుంగా కిరణ్, గజ్జల సాయి, చార్లెస్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం మండలంలో ఎమ్మెల్యే ఆదికి 1741 ఓట్ల మెజారిటీ

కొండాపురం, జూన్ 5: జమ్మలమడుగు ఎమ్మెల్యేగా గెలిచిన దేవగుడి ఆదినారాయణరెడ్డికి మండలంలో 1741 ఓట్ల మెజారిటీ వచ్చింది.మండలంలోని గ్రామాల వారీగా బీజేపీకి వచ్చిన మెజారిటీ వివరాలు ఇలా ఉన్నాయి.టి. కోడూరు(-29) ,సిరిగేపల్లి(91),సంకేపల్లె(197) ,ఎర్రగుడి (-74),చామలూరు (-44), తిరుమాలయపల్లె(-65),దొబ్బుడుపల్లె(-2), గండ్లూరు (191), పి.అనంతపురం(23), చౌటిపల్లె (81) ,ముచ్చుమర్రి(43) ,దత్తాపురం(720),బుక్కపట్నం (166), కె.సుగుమంచిపల్లె (-120),తాళ్లప్రొద్దుటూరు(590) ,కె.వెంకటాపురం(83) ,ఏటూరు (-62), రామిరెడ్డిపలె (-62),నేదరపేట(-80), బురుజుపల్లె (-40),కోనవారిపల్లె (-118), బెడుదూరు (-197),ఎనమలచింతల(65),బి.కొట్టాలపల్లె(8),పొట్టిపాడు(-32),వెంకయ్యకాలువ (166),లావనూరు(321),ఎస్.తిమ్మాపురం(95),కొండాపురం(-229)గ్రామాలలో మెజారిటీ సాధించారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ఖాజీపేట, జూన్ 5: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తే అంటువ్యాధులు రావని సూపర్‌వైజర్లు రమాదేవి, శ్రీదేవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని త్రిపురవరం, కొత్తపల్లె, భూమాయపల్లె అంగన్వాడీ కేంద్రాల్లో బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో అంగన్వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఎంఎన్‌హెచ్‌పీలు, ఎంఎస్‌కేలు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభిమానుల చికెన్ పంపిణీ



ముద్దనూరు జూన్5:మండల కేంద్రంలోని కొత్తకొట్టాలు వీధిలో బుధవారం టీడీపీ దళిత యూత్ అభిమానులు రాష్ట్రంలో ఎన్డీయే కూటమి సీఎంగా చంద్రబాబు, ఎమ్మెల్యేగా ఆదినారాయణ రెడ్డి భారీ విజయం సాధించడంతో చికెన్ పంపిణీ చేశారు. టీడీపీ దళిత యూత్ అభిమానులు ఆది మాదిగ, శ్రీకాంత్ మాదిగ ఆధ్వర్యంలో దాదాపు 70కుటుంబాలకు ఇంటింటికీ వెళ్లి కేజీ చికెన్, మాసాలాలు అందించారు.ఈ కార్యక్రమంలో బాబుమాదిగ,భాస్కర్, హేమంత్, హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు 22న పురస్కారాలు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 5: 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఈనెల 22వ తేదీ ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు గాజులపల్లి పెద్దసుబ్బయ్య, పెద్దసుబ్బమ్మ సేవ సంస్థ అధ్యక్షులు గాజులపల్లె రామచంద్రుడు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్, జడ్పీ, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.2,116, ద్వితీయ బహుమతి రూ.1,116 అందజేస్తామని తెలిపారు. 22వ తేదీ సాయంత్రం పద్మశాలీయ కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమానికి అర్హులైన విద్యార్థులు రెండు ఫొటోలు, మార్కులిస్టు జిరాక్స్ కాపీతో హాజరుకావాలని కోరారు.

'ఎండోమెంటు అసిస్టెంటు కమిషనరును సస్పెండ్ చేయాలి'

పోరుమామిళ్ల , జూన్ 5 : అవినీతికి పాల్పడుతున్న అసిస్టెంటు కమిషనరు శంకరబాలాజీని వెంటనే సస్పెండ్ చేయాలని పోరుమామిళ్ల సీపీయం మండల కర్యాదర్శి భైరవప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగినసమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 నుంచి కడప జిల్లాలో ఆలయాలకు సంబంధించి నిష్పక్షపాతంగా అభివృద్ధి చెందకుండా పోరుమామిళ్లలో చెన్నకేశవస్వామి, దేవాలయ స్థలాలను జిల్లాలోని కాంప్లెక్స్‌లను అనుకూలమైన వారికి కట్టబెడుతున్నారని విమర్శించారు. 11ఏళ్లుగా ప్రొద్దుటూరు, బ్రహ్మంగారిమఠం, మద్దిమాను గురప్పస్వామి దేవాలయాల్లో పెద్దఎత్తున వివాదాల్లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో సీపీయం నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం

ఖాజీపేట, జూన్ 5: మండల ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి అన్నారు. బుధవారం బస్టాండు కూడలిలోని గాంధీ, పొట్టిశ్రీరాముల విగ్రహాలకు పూలమాలలు వేసి బాణసంచా పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం రాజ్ థియేటర్‌లో మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డికి మండల నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫరూక్, సుబ్బయ్య, బుచ్చిరెడ్డి, వెంకటస్వామిరెడ్డి, రవి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, పిచ్చినాయుడు, గోవిందు సుబ్బయ్య, రామానాయుడు, ప్రతాప్‌రెడ్డి, వీరయ్య, శ్రీనివాసులు, జలీల్, హబీబ్, డాక్టర్ ఆసీఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో 3.5ఎంఎం వర్షం

ఎర్రగుంట్ల, జూన్ 5: ఎర్రగుంట్లలో మంగళవారం రాత్రి 3.50ఎంఎం వర్షం కురిసింది. వారం రోజులుగా తీవ్ర ఉక్కపోతతో ఉన్న ప్రజలకు ఊరట కలిగింది. ఎర్రగుంట్లలో వీధుల సంగతి అటుంచితే మెయిన్‌రోడ్లలో కూడా సరైన డ్రైనేజీ వ్యవస్థలేకపోవడంతో నీరంతా రోడ్లపైనే ఆగింది. దీంతో ప్రజలు అసౌఖర్యానికి గురవుతున్నారు. వీధుల్లోనుంచి వచ్చే నీరు వెళ్లేందుకు సరైన వసతిలేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఘనంగా రుద్రహోమం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 5: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా రుద్రహోమం నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం ఆలయ కాలక్షేప మండపంలో గంగ, రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఆశీనులను చేసి కన్నుల పండువగా కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

రాజోలి నిర్మించి తీరుతాం

● 90 కోట్ల తాగునీటి పథకంపై కలెక్టర్‌తో మాట్లాడా : మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు, జూన్ 5 : రాజోలి జలాశయం నిర్మించి తీరుతామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన మొదట సారిగా బుధవారం రాత్రి పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమై విలేకరులతో మాట్లాడారు. అవినీతి, కమీషన్ల పర్వం అనేదే లేకుండా అభివృద్ధే ధ్యేయంగా పాలన చేస్తానని, తొలిరోజే బృహత్తర ఇంటింటికి తాగునీరు అందించేందుకు దాదాపు 90 కోట్ల నిధులపై కలెక్టర్‌తో మాట్లాడినానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేస్తూ అవినీతికి తావులేకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని, సీఎం చంద్రబాబుతో మాట్లాడి రాజోలి జలాశయం, స్టేడియం నిర్మిస్తానన్నారు. అధికారులతో కలసి ప్రతి గ్రామంలో తిరిగి ప్రజా సమస్యలపై బాధ్యత వహిస్తానని తెలిపారు. బృహత్తర తాగునీటి పథకంపైకలెక్టర్ విజయరామరాజుతో మాట్లాడానన్నారు. కాగా కేంద్రంలోనూ ఏన్డీయే కూటమి ఉంది కాబట్టి ప్రత్యేక నిధులు తీసుకవస్తానని, ఎల్లప్పుడూ ప్రజల అభివృద్ధి కోసమే పాటు పడతానన్నారు. కక్ష పూరిత రాజకీయాలు చేయనని పేర్కొన్నారు. కాగా తొలిసారిగా మైదుకూరుకు రావడంతో నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో అభినందించారు. కాగా ప్రొద్దుటూరులోని ఆయన నివాసం వద్దకు కూడా బుధవారం పెద్దసంఖ్యలో అభిమానులు చేరుకొని శుభాకాంక్షలు తెలిపారు.



పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు..: పట్టణంలోని పాతూరులో వెలసిన పెద్దమ్మతల్లిని పుట్టా సుధాకర్ యాదవ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

వరదరాజులరెడ్డికి అభినందనల వెల్లువ



ప్రొద్దుటూరు టౌన్, జూన్ 5: తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎస్.వరదరాజులరెడ్డిని తెలుగుదేశం పార్టీ ఎస్సీసెల్ మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరి పి.దేవదాసు ఘనంగా సత్కరించారు. బుధవారం ఉదయం కామనూరులో వరదరాజులరెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయనకు అభినందనలు తెలిపి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మనోహర్, విజయబాబు, సంజీవకుమార్, కమలమ్మ, జ్యోత్స్న, నిర్మల, శ్రీను, వెంకటసుబ్బయ్య, ముస్కిన్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి



ప్రొద్దుటూరు, జూన్ 5 : చంద్రబాబును మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి కలిశారు. బుధవారం విజయవాడలోని చంద్రబాబు స్వగృహానికి వెళ్లి లింగారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సన్మానించారు. పార్టీ తిరిగి అధికారంలోకి రావడం, చంద్రబాబు మళ్ళీముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టడంపై ఆయన సంతోషాన్ని వ్యక్త పరిచారు.

కోర్టు భవనాల మరమ్మతు పనుల పరిశీలన

ప్రొద్దుటూరు, జూన్ 5 : ప్రొద్దుటూరు రెండో అదనపు మేజిస్ట్రేట్ కోర్టుకు మరమ్మతుల పై ఆర్అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజనీర్ మహేశ్వరరెడ్డి పరిశీలన చేపట్టారు. బుధవారం జిల్లా కోర్టు సముదాయాలను ఆర్అండ్‌బీ ఇన్‌చార్జ్ ఈఈ మాధవి, డీఈ లక్ష్మీనరసింహులుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో అదనపు మేజిస్ట్రేట్ కోర్టు మరమ్మతు పనులకు 15 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులను వెచ్చించి మరమ్మతు పనులను పూర్తి చేస్తామన్నారు. ఎక్కడెక్కడ ఈమరమ్మతులు చేయాలో సూచించారు.పరిశీలన కార్యక్రమంలో జిల్లా సెషన్స్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బందెల ఓబులేసు రిటైర్డ్ ఈఈ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన కూటమి శ్రేణుల సంబరాలు

జమ్మలమడుగు, జూన్ 5: జమ్మలమడుగు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఉదయం ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి కూటమి నాయకులు పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఓట్లు వేసి గెలిపించారని అన్నారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డికి 5 నియోజకవర్గాల్లో బాగా మెజార్టీ వచ్చిందని, కేవలం పులివెందుల, బద్వేలు ప్రాంతాల్లో మెజార్టీ లేక అవినాష్‌రెడ్డి గెలుపొందారని, అయినా ఈసారి ప్రజలు వైఎస్.కుటుంబానికి ఓట్లు వేయలేదని, నైతిక విజయం టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డిదేనన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి గెలుపుతో ప్రొద్దుటూరులో వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అరాచక పాలనకు తెరపడింది. దీంతో పెద్ద ఎత్తున ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి శుభాకాంక్షలు తెలియ జెప్పడానికి టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఉద్యోగ యూనియన్ నేతలు ఉదయం నుంచి కామనూరు లోని ఆయన స్వగృహం వద్ద పార్టీ కార్యాలయంలో జనం పోటెత్తారు. అలాగే టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వరదరాజులరెడ్డి తనయుడు నంద్యాల కొండారెడ్డిని అభిమానులు పెద్ద ఎత్తున కలిసి పూలమాలలతో సత్కరించి తమ సంతోషాన్ని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. కొండారెడ్డి మాట్లాడుతూ రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అహంకారపూరితంగా ప్రొద్దుటూరులో టీడీపీ జెండాను ఎగురవేయనీయనని ఎగిరితే శాశ్వతంగా రాజకీయాలనుంచి తప్పుకుంటానని శపథాలు చేశాడన్నారు.

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు ఘన స్వాగతం

బ్రహ్మంగారిమఠం, జూన్ 5 : పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని బుధవారం మైదుకూరు నియోజకవర్గం శాసనసభ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్ దర్శించుకున్నారు. దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను దేవస్థానం యాజమాన్యం ఘనంగా శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఈశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. మఠాధిపతులు శ్రీవీరకుమారస్వామి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను ఆశీర్వదించారు అమ్మవారి మెమెంటోను అందించారు. అనంతరం పాత్రికేయులతో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ గత పదిహేను సంవత్సరాల నుంచి నా వెంట ఉండి మూడోసారి ఘనంగా తనను మైదుకూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో గెలిపించిన ప్రతి టీడీపీ కార్యకర్తకు, మండల నాయకులకు ప్రజలకు రాబోవు రోజుల్లో అండగా ఉంటానని ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు పుట్టా ప్రభాకర్‌యాదవ్, ముడుమాల పోలిరెడ్డి, ఎస్ఆర్‌శ్రీనివాసులరెడ్డి, ముద్దుక్రిష్ణమనాయుడు, సాంబశివారెడ్డి, లాయరు పట్టాభి, జయరామనాయుడు, రాఘవేంద్ర, సర్పంచ్ నారాయణ, బీమానాయుడు, మిల్లు శ్రీను, చిలమల నాగయ్య, మేకల సుధాకర్, పూజా శివ, రవిశంకర్‌రెడ్డి, శ్రీరాములు, బోలా శ్రీను, అరవ రఘు, లక్ష్మీరెడ్డి, ఆవుల దస్తగిరి, చెన్నుపల్లి జయరామిరెడ్డి, బండి సుబ్బయ్య, కానాల మల్లికార్జునరెడ్డి, బుజ్జి, రవీంద్ర, ఎంవీ రామాంజనేయులు, భగీరథ టీడీపీ నేతలు ప్రజలు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం చరిత్రాత్మకమని సర్పంచ్ యనమల సుధాకర్ అన్నారు. చంద్రబాబు సీఎం అయితే వేంకటేశ్వరస్వామికి 101 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకుంటానని మొక్కుకున్నామని ఇందులో భాగంగా బుధవారం పోరుమామిళ్ల వెంకటేశ్వరస్వామి ఆలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో 101 టెంకాయలును కొట్టి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రామసుబ్బారావు, షరీఫ్, భూపాల్‌రెడ్డి, మస్తాన్, అతికారి రాజా, లక్ష్మణ్‌రావు, సత్యం, రమణ, ప్రసాద్,టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా ఆంధ్రరాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే కూటమి లక్ష్యమని జనసేన నాయకులు సిద్ధు, నియోజకవర్గ కన్వీనరు నందకిశోర్ అన్నారు. కూటమి అధికారంలోకి రావడంతో బుధవారం అక్కల్‌రెడ్డిపల్లెలో జనసేన కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు. కాగా నియోజకవర్గ టీడీపీ యువనేత రితీష్‌కుమార్‌రెడ్డిని రంగసముద్రం ఎంపీటీసీ కల్వకూరి రమణ మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కల్వకూరి రమేశ్, యువకులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు... భూపేశ్‌రెడ్డికి పూలమాలలు వేసి సంబరాలు జరుపుకుంటున్న కార్యకర్తలు

పెద్దాయనను కలిసేందుకు తరలివెళ్లిన నాయకులు

రాజుపాలెం, జూన్ 5 : ప్రొద్దుటూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి భారీ విజయం సాధించడంతో బుధవారం తన స్వగృహమైన కామనూరుకు రాజుపాలెం నుంచి టీడీపీ నాయకులు కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. పూలదండలు, శాలువాతో ఆయనను సన్మానించారు. కష్టపడి పనిచేసి తన గెలుపునకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని వరదరాజులరెడ్డి హామీ ఇచ్చారు.

కొండాపురం..: రాష్ట్రంలో టీడీపీ కూటమి అఖండవిజయం సాధించడంతో పాటు ఎమ్మెల్యేగా ఆదినారాయణరెడ్డి గెలుపొందడంతో బుధవారం కూటమి నేతలు సంబరాలు చేసుకున్నారు.స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ గోరిశెట్టి బాబు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఎంపీ అభ్యర్థిగా స్వల్ప మెజారిటీతో భూపేశ్‌రెడ్డి ఓడిపోయినా నైతికంగా టీడీపీదే విజయ మన్నారు. అదేవిధంగా తాళ్లప్రొద్దుటూరు టీడీపీ కార్యాలయంలో కూడా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు శివ,బుజ్జి,డీలర్‌బాషా,సబ్బులు రమణ,నరసింహారెడ్డి,ప్రత్యూష, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అద్భుత విజయం సాధించడం రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబే సరైన మార్గదర్శి అని ప్రజల గుర్తించారని మాజీ మున్సిపల్ చైర్మన్ సోమేసుల పార్థసారథి పేర్కొన్నారు. బుధవారం ఆయన స్వగృహం వద్ద యువకులతో కేక్ కోసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సతీష్‌రెడ్డి, నాగభూషణం, సుబ్బయ్య, రాధాక్రిష్ణ, సుబ్రమణ్యం, ప్రసాద్, రమేశ్, అలంగీర్, చిన్నపరెడ్డి, సాయి, సుబ్రమణ్యం, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


వరదకు గజమాలతో స్వాగతం పలుకుతున్న టీడీపీ కార్యకర్తలు


బ్రహ్మంగారిమఠంలో పుట్టా సుధాకర్‌యాదవ్‌కు ఘనస్వాగతం పలుకుతున్న అభిమానులు



పోరుమామిళ్లలో టెంకాయలు కొడుతున్న నాయకులు, బద్వేలులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

విద్యారంగ పరిరక్షణకు నడుం కట్టాలి

బద్వేలు, జూన్ 5: సంస్కరణల పేరుతో గత ప్రభుత్వం చేపట్టిన మార్పుల వల వలన కలిగిన నష్టాలను నూతన ప్రభుత్వం సరిదిద్ది విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాధన విజయ్‌కుమార్ కోరారు. ఇందులో భాగంగా మెగా డిఎస్సీపై మొదటి సంతకం చేయాలని ఆయన కోరారు. విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం కృషిచేయాలని ఆయన కోరారు.

దేశ రాజకీయాల్లో గుర్తింపు తెచ్చుకున్న నాయకుడు చంద్రబాబు


విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్డీఏ కూటమి నాయకులు

బద్వేలుటౌన్, జూన్ 5 : దేశరాజకీయాల్లో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న నాయకుడు నారాచంద్రబాబునాయుడు అని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజన్ ఉన్ననాయకుడు అభివృద్ధి అజెండాతో ముందుకు వెళ్లే చంద్రబాబును ఏపీ ప్రజలు ఎన్నుకున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజాపాలనను అందించడంలో విఫలమైందన్నారు. వైసీపీ అరాచకాలతో విసుగుచెందిన చంద్రబాబు తాను సీఎం అయ్యాకే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేశాడు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి భారీ విషయం వరించడంతో చంద్రబాబు శపథం నెరవేరిందన్నారు. బద్వేలు నియోజకవర్గ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామన్నారు.

విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 5: విద్యార్థులు బాల్యం నుంచే పరిసరాల పరిశుభ్రత పాటించాలని సైన్స్ కాంగ్రెస్ జిల్లా కోఆర్డినేటర్ డి.వి.సుబ్బానాయుడు పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జేవీవీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వకృత పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు మురళీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత, అక్షయ, హాసిని, భరత్, అంజి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 5:పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని శ్రీ వేంకటేశ్వర పశువైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ ఇందిర తెలిపారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గోపవరం ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ జ్యోతి, డాక్టర్ వాణి, డాక్టర్ పాండురంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలే ఆధారం

బద్వేలు రూరల్, జూన్ 5 : పర్యావరణం పరిరక్షించాలంటే చెట్లను నరకడం ఆపి మొక్కలు నాటాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ సందర్భంగా బుధవారం స్థానిక కోర్టు ఆధ్వర్యంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఫారెస్టు అధికారులు వారి సిబ్బందితో కలసి మొక్కలునాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి

ఆస్పత్రి అభివృద్ధికోసం రూ.5 లక్షలు వితరణ : ఆది

జమ్మలమడుగు, జూన్ 5: జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి సందర్శించారు. ముందుగా ఆయన ఆస్పత్రి వార్డులను తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. అనంతరం డాక్టర్లతో మాట్లాడారు. మెడికల్ సూపరింటెండెంట్ చాంబర్ నందు ఏర్పాటు చేసిన డాక్టర్ల సమావేశంలో మెడికల్ సూపరింటెండెంట్ సమస్యలు వివరించారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రిలో గతంలో మెడికల్ క్యాంపులు పెట్టానని, మళ్లీ పెట్టడం జరుగుతుందన్నారు. డాక్టర్లు, సిబ్బంది సహకరించి ప్రజల్లో అందరికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఆస్పత్రిలో సమస్యలను అడిగారు. ఆసుపత్రి అభివృద్ధికి ప్రస్తుతానికి రూ.5 లక్షలు ఇస్తానని వెంటనే సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి

పోరుమామిళ్ల , జూన్ 5 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణం పరిరక్షించాలని ఫారెస్టు రేంజ్ అధికారి రఘునాధరెడ్డి అన్నారు. బుధవారం పోరుమామిళ్లలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా రంగసముద్రం పంచాయతీ టీచర్స్ కాలనీ పార్కులో రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయ ఆవరణంలో 250 మొక్కలను నాటారు. ఫారెస్టు అధికారి కరుణాకర్, గురుమూర్తి, విజయభాస్కర్‌రెడ్డి,రత్నస్వామి, అంకాలయ్య పాల్గొన్నారు.

